# దృశ్య బీభత్సం

ఎర్రకోట. మూడు రంగుల జెండా ఎగరలేక వ్రేలాడుతోంది.

జెండా కర్రకి సొరల చుక్కల మెరుపుల విదేశీ పేపరు అంటించివుంది. దాని మీద 'స్పాన్సర్డ్ బై వరల్డ్ బ్యాంక్' అని రాసి వుంది.

ఫైర్ ప్రూఫ్, సౌండ్ ప్రూఫ్, బుల్లెట్ ప్రూఫ్ కేబిన్లో నిలబడి ప్రధానమంత్రి ప్రసంగిస్తున్నారు. దేశం ఎంత వేగంగా ముందుకు దూసుకుపోతోందో వర్ణిస్తున్నారాయన. విదేశీ నేతలూ బహుళ జాతి సంస్థలూ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలూ తమ ప్రభుత్వం సాధించిన విజయాల్ని ఎంతగా ప్రశంసిస్తున్నాయో చెబుతున్నారు. ఆహా ఓహో అనుకుంటూ తన జబ్బల్ని తనే చరుచుకుంటున్నారు.

జనం ఓపిగ్గా కూర్చున్నారు. కొందరు వింటున్నారు. చాలా మంది చూస్తున్నారు.

వారి సంఖ్యని మించి వున్నారు పోలీసులూ రిజర్వు పోలీసులూ భద్రతా దళాలూ. వీరంతా జనం చుట్టూ కాపలా కాస్తున్నట్టుగా చేరి నిలబడ్డారు.

జనం ఉత్సాహంగాలేరు. ఉదాసీనంగా వున్నారు. మొక్కుబడిగా కూర్చున్నారు. తప్పనిసరైనట్టు తప్పించుకునే మార్గం లేనట్టు వున్నారు.

అడపాదడపా ఎవరెవరో ఊత మిస్తోంటే చప్పగా తప్పట్లు కొడుతున్నారు.

ఉన్నట్లుండి జనంలోంచో ముసలాయన లేచి నిలబడ్డాడు.

"కూర్చోరా ముసలి కుక్కా" గర్జించిందో పోలీసు కంఠం.

ఆయన కూర్చోలేదు. విన్పించుకోలేదసలు.

లేచి చిరుగుల దుప్పటిని సరిగ్గా కప్పుకున్నారు. చేతి కర్ర అందుకున్నారు.

"మారు వేషంలో వచ్చిన టెర్రరిస్టేమో?"

ఓ పోలీసు అధికారి బుర్రలో ఫ్లాష్ వెలిగింది.

"ఉస్ సాలా కో పక్డో..."

గబగబా నాలుగు వైపుల్నుంచీ పోలీసులూ మిలటరీ వారూ చుట్టు ముట్టేసి తుపాకులు ఎత్తి పట్టుకున్నారు. ముసలాయన్ని చూచి తుల్లి పడ్డారు. కళ్లు నలుపుకున్నారు. గుటకలు మ్రింగారు.

కొల్లాయిగట్టి దుప్పటి కప్పుకుని సాదా సీదాగా వున్న ముసలాయన వంక వింతగా చూశారు. వెర్రిగా చూశారు.

'బాగా ఎరిగున్న వాళ్లా వున్నాడే' అనుకుని చూశారు.

గుడ్లప్పగించి చూస్తూనే ఒక్కడుగు వెనక్కువేశారు.

ఆయన కర్ర వూతంతో వేగంగా నడచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఎన్‌కౌంటరో అలాటిదేదో జరగబోతోందని గ్రహించి జనం కకావికలుగా పరుగెత్త సాగారు.

"అక్కడేమవుతోంది? అందర్నీ కూర్చోబెట్టండి?" ప్రధాని మైకులో కోప్పడ్డారు.

ప్రధాన రక్షణ సిబ్బంది యావత్తూ గబగబా ప్రధాని 'కేబిన్' చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. ఆయుధాలని స్టెడీగా పట్టుకున్నారు.

"ఏమీ లేదు ఏమీ లేదు.. కూర్చోండి కూర్చోండి..." పోలీసులు హేండ్ మైకుల్లో అరుస్తున్నారు.

దాంతో జనం బెంబేలెత్తిపోయారు. ఏదో పెను ప్రమాదమే జరగబోతోందను కున్నారు. తొక్కుకుంటూ త్రోసుకుంటూ పరుగుపెట్టారు.

"సభని భగ్నం చేయడానికి ప్రతిపక్షాలు పన్నిన కుట్ర ఇది. కూర్చోండి. నా ఉపన్యాసం సాంతం వినండి. మీకోసం ఎన్నో పథకాలు ప్రకటించబోతున్నాను. మీ క్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం..."

కలవరపరుస్తోన్న ఆ దృశ్యాన్ని చూడలేక ప్రధాని తన హోదా మరచి మరీ విజ్ఞప్తి చేశారు.

అయినా జనం వినలేదు. తిరిగి కూర్చోనూలేదు.

"కేబిన్" తలుపు కొంచెంగా త్రోసి "ఏమవుతోందసలు?" అని ఓ అధికార్ని ప్రశ్నించారు.

అతడు ఓ చెవితో వైర్లెస్ మెస్సేజ్ వింటూనే ప్రధాని దగ్గరకు దూసువెళ్ళాడు. ఏదో అనుమానించి రక్షణ దళం మెషిన్ గన్స్ అతడి వైపు తిప్పాయి.

"జస్ట్ మేస్సేజ్ ఇవ్వడానికయ్యాబాబూ.."

అనుమానంగా చూస్తూ అతడ్ని వెళ్ళనిచ్చారు.

అతడు కేబిన్ ప్రక్కకెళ్లి ప్రధానికి సెల్యూట్ చేశాడు.

"ఆ గొడవేంటి?" ప్రధాని విసుక్కున్నారు.

"ఒక ముసలాయన మధ్యలో లేచాడు సార్..."

"ప్రక్క కీడ్చెయ్యకపోయారా?"

"అతడు... ఆయన..."

"నీళ్లు నములుతావెందుకూ తిన్నగా చెప్పరాదూ?"

"గాంధీజీలా వున్నార్ట సార్"

"ఏ గాంధీ?" నుదురు చిట్లించి విసుగ్గా అడిగారు.

"మోహన్ దాస్ కరంచంద్ గాంధీ..."

"ఆయనెలా వస్తాడు? ఎప్పుడో చంపేశారు కదా!"

"కాని... వచ్చార్సార్..."

"చచ్చినవాడెలా వస్తాడోయ్... వెళ్ళండెళ్ళండి. కళ్లు తెరచి చూడండి.."

"అతడు తీవ్రవాదేమోనని సాయుధ దళాలు చుట్టు ముట్టాయి సార్. కానాయన మౌనంగా నడుస్తూ వెళ్ళిపోయాట్ట సార్"

"ఎలా వెళ్ళనిచ్చారు? పట్టుకోండి... అన్ని రోడ్లూ బంద్ చేసి అన్ని చోట్లా వెదకండి.. ఇరవై నాలుగ్గంటల్లో అతడ్ని బంధించాలి. దీసీజ్ మై ఆర్డర్"

"ఎస్సర్"

వెంటనే ఆదేశాలివ్వబడ్డాయి.

"గాంధీలా వుండే ముసలాయన ఎక్కడ కన్పిస్తే అక్కడ ఎలా కనిపిస్తే అలా అరెస్ట్ చేసెయ్యండి. ప్రధాని సభని భగ్నం చేశాడు. ప్రభుత్వ ఇమేజ్‌కి డామేజ్ కలిగించాడు. శాంతి భద్రతలకు ముప్పు కలిగించాలని చూస్తున్నాడు. బహుశా తీవ్రవాద సంస్థకి చెందినవాడై వుంటాడు. బీ కేర్ ఫుల్. హేండిల్ విత్ కేర్..."

దేశంలోని అన్ని ప్రాంతాలకీ మెస్సేజ్‌లు పంపబడ్డాయి.

రేడియో ద్వారా పదే పదే ప్రకటించారు. దూరదర్శన్‌లో పది నిమిషాలకోసారి ముసలాయన్ని చూపి ఆచూకీ తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్లో తెలియజేయమని కోరారు.

"ఆయనెవరై వుంటారు?"

విదేశీ గూఢచారా? స్వదేశీ తీవ్రవాదా?

ఎందుకొచ్చాడు?

ప్రభుత్వాన్ని అస్థిరపర్చడానికా? ప్రజలలో అశాంతి రగిలించడానికా? లేక ఇంకేదైనా వ్యూహం వుందా?

ప్రధాని జుట్టు పీక్కున్నారు. విదేశీ సలహాదారుల్ని సంప్రదించారు. ఎవరూ తృప్తిపర్చే సమాధానం ఇవ్వలేకపోయారు.

మంత్రివర్గం సమావేశమైంది. వాడిగా వేడిగా చర్చలు జరిగాయి.

ఒక ముసలాయన్ని బంధించలేకపోవడం ప్రభుత్వ శక్తికే అవమానమంటూ రెచ్చిపోయారు కొందరు.

అవసరమైతే యావత్తు మిలటరీని రంగంలోకి దింపి అయినా సరే గాలించండన్నారు ఇంకొందరు.

ఇది పరిష్కారం కాకపోతే మా మద్దత్తు ఉపసంహరించుకుంటామనీ ప్రభుత్వం సంక్షోభంలో పడుతుందనీ హెచ్చరించిందో మిత్రపక్షం.

ప్రతిపక్ష పార్టీలన్నీ కూడా అత్యవసర సమావేశాలు జరిపాయి.

ఎర్రకోట దగ్గరికొచ్చి మరీ సంచలనం సృష్టించిన ఒక ముసలాయన్ని బంధించలేకపోవడం సిగ్గుచేటనీ, వెంటనే ప్రభుత్వం రాజీనామా చేయాలనీ డిమాండ్ చేశాయి. రాష్ట్రపతికి వినతి పత్రాలని కూడా సమర్పించాయి.

అన్ని చోట్లా గాలింపు మొదలైంది.

కుల సంఘపు మీటింగుల్లో మత సంస్థల ప్రార్థనాలయాల్లో రాజకీయ సమావేశాల్లో ఉద్యోగుల ఊరేగింపుల్లో నాయకుల సన్మాన సభల్లో వ్యాపారుల విందుల్లో అన్ని చోట్లా వెదికారు. దేశమంతా జల్లెడపట్టారు.

ఉహూ ఆయన ఆచూకీ దొరకలేదు.

ప్రధాని నుంచి మున్సిపల్ ఛైర్మన్ వరకు అంతా టెన్షన్‌తో వూగిపోతున్నారు. ఆ పెద్దాయన దొరక్కపోతే ఏదో ప్రళయం వస్తుందేమోనన్న భయంతో ఆందోళనతో బెంబేలు పడుతున్నారు. కసిగా పిచ్చిగా ఆదేశాలు జారీచేస్తున్నారు.

ఓ మారు మూల పల్లెలో చూశామని ఎవరో ఆకాశరామన్న పిసరంత 'ఉప్పు' అందించాడు.

"ఛలో..."

ఉక్కు బూట్ల టక్ టక్... జీపుల రొద... ఫోన్ల గణగణ.

'దొరికాడా?'

ఒకటే ప్రశ్న

"వెళ్తున్నాం"

"త్వరగా వెళ్ళి చావండి"

"ఎస్సార్..."

ఊళ్లోని ఇల్లిల్లూ వెదికారు. ముసలోళ్ళందరి చేత పెరేడ్ చేయించారు. యువకుల్ని హింసించారు. మాకు తెలీదంటే మాకు తెలీదన్నారు.

ఏం చేయాలో తోచలేదు. ఏ మొహం పెట్టుకుని వెనక్కెళ్లాలో తేలీలేదు. బాసులు ఏ భాషలో తిడతారో బోధపడలేదు.

ఇంతలో ఫోన్లు... తిట్లు... బెదిరింపులు...!

"మమ్మల్ని చంపుకుతింటున్నావు కదరా... త్వరగా దొరికి చావొచ్చుకదా"

విసుకున్నారు. పచ్చిగా తిట్టారు.

ఓ కుర్రాడొచ్చి భయంగా చూస్తూ నిలబడ్డాడు.

కళ్లెర్రజేసి చూసి "ముసలోడ్ని చూశావా?" అడిగిందో ఎర్రటోపీ.

"పొలంలో బొక్క బోర్లా పడుకున్నాడు..."

"ఎందుకు పడకున్నాడు? సీడ్ పేటెంటు గొడవలూ గాట్ ఒప్పందాలూ కల్తీ మందుల సంగతీ పెరిగిన ఎరువుల ధరలూ అతడికి తెలుసా?"

"ఏవోఁ మరి..."

"పదండి పదండి.. డెడ్ ఆర్ ఎలైవ్ అన్నారు. సజీవంగానో నిర్జీవంగానో దొరికితే చాలు. మనిషినో శవాన్నో అప్పగించి హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చు."

రక్షక భట శ్రేణులు కదిలాయి.

కల్తీ ఎరువులూ పురుగు మందులూ తినేసిన పొలాల్లోంచి, నీరందని బీడుపడిన చేలల్లోంచి, కాలిన మోటర్ల ప్రక్కనుంచి పడుతూ లేస్తూ తిట్టుకుంటూ శపిస్తూ సమీపించారు.

కదలక మెదలక మట్టిలో పడున్న ముసలాయన కంట బడేసరికి ప్రాణం లేచి వచ్చిందందరికీ.

ప్రక్కకి దొర్లించి చూశారు.

అచ్చం గాంధీజీలా వున్నాడు. కొంచెం దూరంలో పురుగు మందు డబ్బా ఖాళీగా పడివుంది. చూడటానికే భయంకరంగా వుందా దృశ్యం. కాని వారందరికీ ఎంతో ఆనందం కలిగింది.

"థాంక్ గాడ్..."

గబగబా మెస్సేజీలు హస్తినాపురం వెళ్ళిపోయాయి.

అంతా ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యారు. గుండెల మీది బరువేదో దిగిపోయి నట్టు అనుభూతి చెందారు.

శవాన్నెవరూ స్వాధీనం చేసుకోడానికి ముందుకు రాలేదు.

అంచేత ప్రభుత్వమే శవదహన ఏర్పాట్లు చేసినట్లు ప్రధాని ప్రకటించారు.

మరుక్షణం ఈ వార్తని బిబిసి ప్రపంచానికి గొప్పగా తెలియజేసింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)

**15.9.2001**